క్లుప్తంగా

రహదారి పరిశీలన



చిరుమర్రి వద్ద రహదారిని పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

ముదిగొండ: మండలపరిధిలోని చిరుమర్రి – గోకినేపల్లి రహదారిని ఖమ్మం ఆర్డీఓ గణేష్ సోమవారం పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో రహదారి నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో ఆ రహదారిని ఆర్డీఓ పరిశీలించారు. సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమల కరుణాకర్‌రెడ్డి, ఆర్‌ఐలు ఉషా, వహిదా, సర్వేయర్ ఉమామహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు మువ్వా అభినందన



తీన్మార్ మల్లన్నను అభినందిస్తున్న మువ్వా విజయబాబు

సత్తుపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు హైద్రాబాద్‌లో సోమవారం కలిసి అభినందించారు. ఆయన వెంట రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు రఘునాద్‌యాదవ్ ఉన్నారు.

ఎర్రుపాలెంకు బస్ సర్వీస్

మధిర: మధిర బస్టాండ్ నుంచి రాత్రి సమయంలో ఎర్రుపాలెం వెళ్లేందుకు ప్రత్యేక బస్సు సర్వీస్ ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ నుంచి మధిరకు వచ్చే శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు సమయానికి మధిర నుంచి ఎర్రుపాలెం వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం మధిర బస్టాండ్‌లో రాత్రి 9 గంటలకు బస్ బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మధిర ప్రాంత ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూనాటికి పలువురి నివాళులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు పూనాటి వెంకటేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మరణించారు. సోమవారం నిర్వహించిన పూనాటి వెంకటేశ్వరరావు దశదిన కర్మలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు, పమ్మి అశోక్ తదితరులు పూనాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పరామర్శ..

కల్లూరురూరల్: మండలంలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన సోంబత్తిని ఏసు అనారోగ్యానికి గురికావటంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లాలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ గంగరాజు తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి వెళ్లి ఏసు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సోంబతిని ఏసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జయప్రదం చేయండి

వైరా: జూన్ 11, 12 తేదీల్లో వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో నిర్వహించే రాజకీయ శిక్షణా తరగతులకు సీపీఎం శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆ పార్టీ వైరా టౌన్ కార్యదర్శి సుంకర సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ శిక్షణా తరగతుల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు, రాష్ట్ర నాయకులు చలమల విఠల్, ప్రిన్సిపాల్ బోడపట్ల రవీందర్ తరగతులు బోధిస్తారని తెలిపారు.

ముళ్లపొదలు తొలగింపు

ఏన్కూరు: మండలంలోని కేసుపల్లి రహదారి కిరువైపుల ఉన్న ముళ్లపొదలను నారాయణ, బసవమ్మ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. తూతకలింగన్నపేట నుంచి కేసుపల్లి వరకు రోడ్డు రెండు పక్కల ఉన్న ముళ్లపొదలను జేసీబీతో తొలగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జాప్యమెందుకు..?



పూర్తికాని పెనుబల్లి ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ భవనం

పూర్తికాని ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మాణాలు

- ఏడాదికిపైగా సాగుతున్న పనులు
- అద్దె ఇళ్లల్లో నడుస్తున్న హెల్త్ సబ్ సెంటర్లు
- నిలిచిన ఎంబీబీఎస్ డాక్టర్ల నియామకం

పెనుబల్లి: గ్రామాల్లో ప్రజల దగ్గరకు వైద్య ఆరోగ్య సేవలు అందించడానికి ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మాణాలను చేపట్టింది. ఈ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాన్ని ప్రారంభించి ఏడాది అవుతున్నా.. పనులు నేటికీ పూర్తికాక పలు గ్రామాల ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందడంలేదు.

మండలంలో పీహెచ్‌సీలోని సబ్‌సెంటర్లు..

పెనుబల్లి పరిధిలోని లంకాసాగర్ పీహెచ్‌సీ పరిధిలో 11 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఈ సెంటర్లలో ఏఎన్‌ఎంల ద్వారా గతంలో గ్రామాల్లో వైద్య ఆరోగ్య సేవలు అందించేవారు. ప్రస్తుతం ఈ సబ్ సెంటర్లను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా మార్చి ఒక ఎంబీబీఎస్ వైద్యుడితో పాటు.. ఫార్మసీ, రక్త పరీక్షలు, క్లినిక్ సేవలు అందేలా నిర్మాణాలు చేపట్టారు. భవన్నపాలెం, లింగగూడెం, టేకులపల్లి, లంకపల్లిలో మూడేళ్ల క్రితమే ఈ ఆరోగ్య మందిర్లు నిర్మాణాలు పూర్తై వైద్య సేవలు అందుతున్నాయి.

ఏడాది దాటినా..

పెనుబల్లి, వీయంబంజర్, తాళ్లపెంట, ముత్తగూడెంలో మంజూరైన ఆరోగ్య మందిర్‌లు గత ఏడాదికిపైగా భవన నిర్మాణ పనులు పూర్తికాక జాప్యం జరుగుతుంది. ముత్తగూడెంలో భవనం కోర్టు కేసుల్లో ఉండి జాప్యం జరుగుతుండగా, పెనుబల్లి, వీయంబంజర్, తాల్లపెంటల్లో కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగా స్లాబు పూర్తి అయినప్పటికీ తుది పనులు పూర్తికాక నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయాయి. పాతకారాయిగూడెంకు మంజూరైన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎన్నికల కోడ్ కారణంగా పనులు ప్రారంభం కాలేదు. మర్లకుంటలో గతంలో నిర్మించిన పాత భవనంలోనే వైద్య సేవలు కొనసాగుతుండగా, లంకాసాగర్ సబ్ సెంటర్ పరిధిలో భవన నిర్మాణం మంజూరీ కాలేదు.

అనుమతి లభిస్తే నియామకాలు..

మర్లకుంట, లంకాసాగర్ సబ్ సెంటర్ల పరిధిలో కూడా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి లభిస్తే మండల వ్యాప్తంగా వైద్య ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయి. దీంతో గ్రామాల్లో ఎంబీబీఎస్ వైద్యులు, హోమియోపతి ఆయుర్వేదిక్ వైద్యులను నియమించడం. శిక్షణ పొందిన మల్టీ లెవల్ హెల్త్ పర్సన్ (ఎంఎల్ హెచ్‌పీ) ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందించడమే కాకుండా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా పూర్తిస్థాయి నిష్ణాతులైన వైద్య సిబ్బంది అందుబాటులోకి వస్తారు.

త్వరితగతిన పూర్తి చేయాలి..

రానున్న వర్షాకాలంలో సీజనల్ ప్రభలే ప్రమాదం ఉన్న కారణంగా అధికారులు చర్యలు తీసుకొని భవన్నాల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వం జరిగిన జాప్యాన్ని నివారించి వెంటనే పనులు పూర్తి చేసి, వైద్యులను నియమించి, వైద్య ఆరోగ్య సేవలు గ్రామాల ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా చేయిస్తాం..



పెనుబల్లి, వీయంబంజర్, తాళ్లపెంట భవనాలు త్వరగా పూర్తి అయ్యేలా కాంట్రాక్టర్లతో మాట్లాడి పూర్తి చేస్తాము. ముత్తగూడెం భవన నిర్మాణం కోర్టు కేసు కారణంగా జాప్యం జరుగుతుంది. రానున్న రెండు మూడు నెలల్లో భవనాల నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం.

– రమేష్, పంచాయతీ రాజ్ మండల ఏఈ, పెనుబల్లి

నిర్మాణం పూర్తిచేయాలి..



ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాల నిర్మాణం పూర్తైతే నిష్ణాతులైన వైద్యులు అందుబాటులోకి వస్తారు. గ్రామాల్లో ప్రజలకు చేరువగా మెరుగైన వైద్య సేవలు అందుతాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యం చేస్తున్నాం.

– డాక్టర్ కిరణ్ కుమార్, పీహెచ్‌సీ వైద్యుడు, లంకాసాగర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

కల్లూరురూరల్/చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కల్లూరు ఎంఈఓ దామోదర ప్రసాద్, చింతకాని ఎంఈఓ మోదుగు శ్యాంసన్ తెలిపారు. సోమవారం కల్లూరులోని చెన్నూరులో, చింతకాని మండలంలోని పందిళ్లపల్లి గ్రామంలో పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీలు, ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, నోట్ పుస్తకాలను అందజేయటం జరుగుతుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యను అందించటం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులే ఉత్తమ ర్యాంక్‌లను సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చెన్నూరు కాంప్లెక్స్ హెచ్‌ఎం మధు, చెన్నూరు హెచ్‌డబ్ల్యూ హెచ్‌ఎం బి.నాగు, పీఎస్ హెచ్‌ఎం వై.అప్పారావు, రావికంపాడు హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు దంతాల సుధాకర్, పందిళ్లపల్లి పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



చింతకాని: పందిళ్లపల్లిలో నిర్వహించిన ప్రచారంలో ఎంఈఓ మోదుగు శ్యాంసన్

పంపు కనెక్షన్లు ఆన్‌లైన్‌లో నమోదు



ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

ముదిగొండ: మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో జీపీ కార్యదర్శులు సోమవారం ప్రతి ఇంటి పంపు కనెక్షన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి మిషన్‌భగీరథ పంపు కనెక్షన్ ఉందా, లేదా, ఉంటే మంచినీరు సక్రమంగా వస్తుందా, అనే దానిపై వారికి కేటాయించిన సెల్‌ఫోన్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ కార్యక్రమం చేట్టారు. మండలపరిధిలోని న్యూలక్ష్మీపురం, కమలాపురం, బాణాపురం, బాణాపురం తండాలలో ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని ఎంపీఓ సూర్యనారాయణ పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయాలి



ఐబీ డీఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు సంబంధించిన కుడి ఎడమ కాల్వలను తక్షణమే మరమ్మతులు చేయాలని తెలంగాణ రైతు సంఘం, రిజర్వాయర్ ఆయకట్టు పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో వైరా ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. పంట కాల్వలు ధ్వంసమై అధ్వానంగా తయారు కావడం వల్ల నీరు పారే పరిస్థితి లేదన్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండి కాలువలకు నీరు విడుదల చేయకముందే మరమ్మతులు చేపడితే మంచిదన్నారు. దీనిపై డీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉన్నతాధికారులకు తెలియజేసి కాల్వ మరమ్మతులు చేపట్టడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వనమా చిన సత్యనారాయణ, మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వీరభద్రం, మల్లిఖార్జున్, రమణ, శ్రీనాద్, నరసయ్య, పురుషోత్తం, చలపతిరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ఏవీఎస్ ప్రసాద్ రాజు

పెనుబల్లి: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ఏవీఎస్ ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. రావు అండ్ రావు ఎంటర్‌ప్రైజెస్, సాయిరామ్ ట్రేడర్స్, మన గ్రోమోర్ షాపు, శ్రీవీర హనుమాన్ ట్రేడర్స్ షాపుల లోని విత్తనాలు, ఎరువుల నిల్వలను ఫెర్టిలైజర్ ఇన్వెస్టరీ వెరిఫికేషన్ సిస్టమ్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పత్తివిత్తనాలను ఎమ్మార్పీ ధరకే అమ్మాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్ని రోజులు ఈ ఇబ్బందులు?

ముదిగొండ: మండలపరిధిలోని న్యూలక్ష్మీపురం –సువర్ణాపురం వరకు బీటీ రహదారి గుంతలు పడడంతో తవ్వి కంకర పరిచారు. ఈ క్రమంలో కంకరతో నెలరోజుల నుంచి పలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు రెండు కిలోమీటర్ల రహదారిపై దుమ్ములేచి కళ్లల్లో పడడమే కాకుండా కంకర రాళ్లు వాహనాల చక్రాలతో లేచి పక్కవారిపై పడుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సంవత్సరం నుంచి విపరీతమైన గుంతలు ఈ రహదారిపై ఉండడంతో ఇటీవల మరమ్మతుల పేరుతో మొదలు పెట్టి పనులు వదిలేశారు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సువర్ణాపురం వద్ద కంకర పరిచిన రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం ఫీడర్‌లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. అన్నారుగూడెం, గోపాలపేట, నరసింహారావు పేట, లక్ష్మీనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని ఏఈ రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శివాలయంలో అన్నదానం



శివాలయంలో అన్నదానం చేస్తున్న దాతలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వెంగళరావునగర్‌లో గల శ్రీభ్రమరాంభిక సమేత మల్లిఖార్జున స్వామి(శివాలయం)లో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పూజల రవి, సుజాత దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రామడుగు గురుబ్రహ్మాచార్యులు, పద్మ, బాబురావు, శ్రీనివాసరావు, బాలాజీ, సతీష్ పాల్గొన్నారు.

గొల్లపూడి వృద్ధాశ్రమంలో..

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ మోదుగు బాలు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు ఉపేందర్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, వాసవి, సౌమ్య, స్వామి దాసు, వెంకట్రావమ్మ, సుజాత, భద్రం, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు..

- చెరువు ఆక్రమణలను తొలగించండి..
- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



తాళ్లచెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, తదితరులు

సత్తుపల్లి: వ్యవసాయ సీజన్ మొదలవుతున్నందున చెరువులు, తూములు, కాలువలు శుభ్రం చేయించి, చెరువు పరిధిలో ఆక్రమణలను తక్షణం తొలగించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సోమవారం ఆమె పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. తొలుత వేంసూరు మండలం తాళ్ల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమకు రైతులే ముఖ్యమని తెలిపారు. చెరువు శిఖం భూములను ఆక్రమిస్తే కేసులు పెట్టాలని ఆదేశించారు. వేశ్యకాంతల చెరువుకు ఆనుకుని ఉన్న మూడో తూము కాల్వలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఆలోగా రైతులు సాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, గాడిదలవాగు ఆక్రమణ, వేశ్యకాంతల చెరువుకు నీళ్లు సాఫీగా రాకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులపై తక్షణ చర్యలకు ఉపక్రమించాలన్నారు. సత్తుపల్లి మండలం నారాయణపురం నల్లకాలువ ఆక్రమణపై ఎమ్మెల్యే ఆరా తీయగా... నోటీసులు ఇచ్చామని ఇరిగేషన్ అధికారులు చెప్పడంతో కేసు పెట్టాలని ఆదేశించారు. అలాగే, అమ్మపాలెం చెరువుకు బేతుపల్లి కాల్వ నీళ్లు వస్తున్నా నిండని నేపథ్యాన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిబంధనలను అతిక్రమిస్తే ఊరుకోం..

జాతీయ రహదారి పనులు చేపట్టే కాంట్రాక్టర్ అనుమతికి మించి చెరువుల నుంచి మట్టి తోలుతున్నా అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఎమ్మెల్యే రాగమయి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాళ్ల చెరువులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నా అధికారులు పర్యవేక్షించడం లేదా అని ప్రశ్నించారు. అంతేకాక నల్లకుంట చెరువు 16 ఎకరాల నుంచి నాలుగెకరాలకు కుదించుకుపోయిందని రైతులు ఫిర్యాదు చేయటంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. వేంసూరు లిఫ్ట్–2కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ.10కోట్లు మంజూరు చేయిస్తే జాతీయ రహదారి కాంట్రాక్టర్ నిర్వాకంతో పైపులు రోడ్ల కిందకు పోయాయని, ఇప్పుడు లిఫ్ట్ నుంచి ఎర్రసాని బంజరుకు సాగునీరు ఎలా వెళ్తుందని ప్రశ్నించారు. కాగా, 20 చెరువుల నుంచి మట్టి తరలింపునకు రూ.1.20 కోట్లు ప్రభుత్వానికి చెల్లించి అనుమతి తీసుకున్నామని బదులిచ్చిన కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే సరిచేస్తామన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈఈ ఎస్.శ్రీనివాసరెడ్డి, డీఈఈలు మరియన్న, వెంకటేశ్వర్లు, డాక్టర్ మట్టా దయానంద్, రైతులు చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, కాసర్ల చంద్రశేఖర్‌రెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, గోపాలకృష్ణ, భీమిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అధికారులు పనితీరు మార్చుకోవాలి..

వేంసూరు: మండల అధికారుల పనితీరుపై ఫిర్యాదులు ఉన్నందున ఇకనైనా తీరు మార్చుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి సూచించారు. మండల పరిషత్, తహసీల్‌లో.. సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్లు తప్ప అధికారులెవరూ లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆ తర్వాత తహసీల్‌లో అధికారులతో సమావేశమై మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ప్రతీ దరఖాస్తును వారంలోగా పరిష్కరించాలని, సాధ్యం కాకపోతే కారణాలను వివరించాలని తెలిపారు. అలాగే, అవినీతి ఎక్కువగా జరుగుతోందని ఫిర్యాదులు ఉన్నందున ఇకనైనా నిజాయితీగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, ఎండీ.ఫైజుద్దీన్, గొర్ల వెంకటప్పరెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, మందపాటి రాఘవరెడ్డి, జంగ శ్రీనివాసరెడ్డి, ఎం.డీ.ఫక్రుద్దీన్, బండి శ్రీనివాసరెడ్డి, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వరెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ



కొణిజర్లలో పాఠ్య పుస్తకాలు తీసుకుంటున్న దృశ్యం

కొణిజర్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. మండలంలో 54 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 19,259 పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అవసరం ఉండగా 17,610 పుస్తకాలు దాదాపు 91 శాతం పుస్తకాలు వచ్చాయి. వీటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు ఈ ఏడాది ప్రభుత్వం కొత్తగా అందజేస్తున్న నోట్ పుస్తకాలు సైతం పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

కొణిజర్ల: పంచాయతీలలో పని చేసే పంచాయతీ గుమస్తాలు, పారిశుద్ధ్య కార్మికులకు గత 5 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయ యూడీసీ శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల్లో అన్ని పనులకు వాడుకుంటున్నారు తప్ప జీతాలు మాత్రం ఇవ్వడం లేదని.. తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నరేష్, భాస్కర్‌రావు, నారాయణ, సుధాకర్‌రెడ్డి, రాంబాబు, గోపి, సీతారాములు, రాములు, బాబూరావు, శ్రీహరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కారేపల్లిలో..

కారేపల్లి: పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయితీ వర్కర్ల వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ, సింగరేణి మండల గ్రామపంచాయితీ వర్కర్లు సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నందు సోమవారం ఆందోళనకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం జీపీ వర్కర్లపై కనికరం చూపడంలేదన్నారు. అనంతరం ఎంపిఓ పర్వీన్‌కైసర్‌కు వినతిపత్రంను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.నరేంద్ర, జీపీ.వర్కర్ల నాయకులు కె.హుస్సేన్, కొమరయ్య, వెంకటేష్, మోతీలాల్, భాస్కర్, సూర్యనారాయణ, సుల్తానా, పద్మ, రాందాస్, తిరుపతయ్య, ఆదెర్ల శ్రీను, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.



కారేపల్లి: ఎంపీఓ పర్వీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీపీ వర్కర్లు



పెద్దమునగాల చెరువులో చేపట్టిన మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

అంతా మా ఇష్టం..

- యథేచ్ఛగా చెరువుల్లో మట్టి తవ్వకాలు
- అనుమతులిచ్చామంటూ పట్టించుకోని అధికారులు

పలు గ్రామాల చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు రేయింబవళ్లు చేపడుతున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లతో ఇష్టానుసారం మట్టి తవ్వకాలు చేస్తూ రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ఇళ్ల స్థలాలు ఎత్తు పెంచుకునేందుకు మట్టి తోలకాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. పొలాలకు తోలుకోవడానికి అనుమతులు ఇచ్చామంటూ అధికారులు కనీసం అటువైపు కూడా తిరిగి చూడటంలేదు. దీంతో మట్టి దందా మూడు పూలు, ఆరు కాయలు అన్నచందంగా సాగుతోంది.

కొణిజర్ల: మండల కేంద్రం కొణిజర్లలోని ఊరచెరువు, చీకటి చెరువు, పెద్దమునగాల, పెద్దగోపతి పాన్ చెరువు, చిన్నగోపతి చెరువు, తనికెళ్ల, గుబ్బగుర్తి, పెద్ద రాంపురం, లాలాపురం, గుండ్రాతిమడుగు, సింగరాయపాలెంలలో ఉన్న వైరా రిజర్వాయర్ శిఖం భూముల నుంచి యథేచ్ఛగా మట్టి తోలకాలు చేపడుతున్నారు. చెరువులో ఒండ్రు మట్టి అది కూడా రెండు అడుగుల లోతు మాత్రమే తవ్వి.. చేలకు ఎరువుగా వాడుకోవడానికి అధికారులు అనుమతులు ఇచ్చారు. దీనిని అలుసుగా తీసుకుని మట్టిదందా చలాయిస్తున్న వ్యక్తులు వేలాది ట్రిప్పుల మట్టి రియల్ ఎస్టేట్ భూములకు ఇష్టం వచ్చినట్లు తోలుకుంటున్నారు.

ప్రమాదకరంగా తయారైన గుంతలు..

మట్టి వ్యాపారులు రెండు అడుగులు కాస్త.. ఆరు అడుగుల వరకు తమకు మంచి మట్టి ఎక్కడ దొరికితే అక్కడ తవ్వుతున్నారు. ఈ క్రమంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో వర్షాకాలంలో వానలు వచ్చిన తర్వాత గుంతల్లో నీరు చేరుతుంది. ఈ క్రమంలో అటుగా వెళ్లే రైతులు, పశువులు, మత్స్యకారులు తెలియక గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

నిత్యం పదుల సంఖ్యలో జిల్లా అధికారులు తిరిగే ఖమ్మం – సత్తుపల్లి రాష్ట్రీయ రహదారి పక్కనే వేలాది ట్రిప్పుల నల్లమట్టి రియల్ ఎస్టేట్ వెంచర్‌లో తోలుతుంటే.. ఐబీ అధికారులు మాత్రం మా దృష్టికి రాలేదే అని తేలిగ్గా తీసిపారేస్తున్నారు. ఇంకొంతమంది మట్టి తోలుకోవడానికి అనుమతులు తీసుకున్నారు. వారి ఎక్కడికి తోలుకుంటే మాకెందుకు అని సమాధానం ఇస్తున్నారు. మట్టి మాఫియా వల్ల ప్రభుత్వం కోట్లాది రూపాయలు నష్టపోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి తోలకాలపై పర్యవేక్షణ ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు ఐబీ అధికారులను ఫోన్‌లో ప్రయత్నించగా ఎవరూ స్పందించలేదు.



తనికెళ్లలోని ఓ రియల్‌ఎస్టేట్ వెంచర్‌లోకి తోలిన మట్టి